
నష్ట జాతకులు

- ఎన్నికలకు ముందు వైసీపీలో చేరిన నేతల అంతర్మథనం

రాజకీయాలన్నవి పరమపద సోపానపటంలో ఆటలాంటివే అంటారు. ఆచితూచి అడుగు వేయకపోతే భవిష్యత్తు అథఃపాతాళంలోకి జారిపోతుంది. ఉద్వేగంతో తీసుకునే నిర్ణయాలు ఎదురు తిరుగుతాయి. ఎంతో కాలం టీడీపీలో ఉండి ఎన్నికలకు ముందు వైసీపీలో చేరిన కొందరు జిల్లా నాయకుల పరిస్థితి ఇప్పుడు ఇలాగే అయ్యింది. వైసీపీ గెలుస్తుందనే నమ్మకంతో భవిష్యత్తును ఆశించి పార్టీ మారిన వీరికి టీడీపీ విజయంతో భంగపాటు ఎదురైంది. ఉన్నచోటా ఉనికీ గౌరవమూ దక్కేలా లేదు. మళ్లీ వెనక్కి దూకుదామా అన్నా మతిస్తారనే నమ్మకం లేదు. వీళ్లని నమ్ముకున్న అనుచరులు ఇప్పుడు మరీ ఎక్కువగా చింతిస్తున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి





ఏమిటిది హరికృష్ణ?

మాజీ డిప్యూటీ స్పీకర్ గుమ్మడి కుతూహలమ్మ కుమారుడు హరికృష్ణకు టీడీపీ 2019 ఎన్నికల్లో జీడీ నెల్లూరు నుంచి పోటీ చేసే అవకాశం ఇచ్చింది. నారాయణస్వామి చేతిలో ఓడిపోయిన ఈయన ఆ తర్వాత పత్తా లేరు. పార్టీ కార్యక్రమాల్లో కనిపించని ఈయన ఎన్నికలకు ముందు పూతలపట్టులో జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. కనీసం సైలెంట్‌గా ఉన్నా మంచి జరిగేది కదన్నా అని ఆయన అనుచరులు వాపోతున్నారు.



అయ్యో.. అనీషా

2019 ఎన్నికల్లో పుంగనూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన అనీషారెడ్డి సరిగ్గా ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. జిల్లా రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన దివంగత నేత రామకృష్ణారెడ్డి కుమారుడైన అమరనాథరెడ్డి సోదరుడు శ్రీనాథరెడ్డి భార్య అనీషారెడ్డి. 2019 ఎన్నికల దాకా పెద్దిరెడ్డి దాష్టీకాన్ని సవాలు చేసిన ఈమె ఓటమి తర్వాత అంత క్రియాశీలకంగా పార్టీ వ్యవహారాల్లో లేరు. చల్లా రామచంద్రారెడ్డికి పుంగనూరు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించిన తర్వాత ఈమె పూర్తి అసంతృప్తితో ఉన్నారు. అయితే అనీషారెడ్డి భర్త శ్రీనాథ్‌రెడ్డికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పదవి ఇచ్చారు. అయినా ఈ దంపతులు సంతృప్తి చెందలేదు. పుంగనూరు టికెట్ కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి అని ప్రకటించిన తర్వాత ఈ దంపతులు ఇడుపులపాయలో జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. నిజానికి వీరికి చంద్రబాబు వద్ద మంచి సాన్నిహిత్యం ఉండేది. పార్టీ మారడంతో ఆ విశ్వసనీయత ను కోల్పోయారు. సరిగ్గా టీడీపీ అధికారంలోకి వచ్చే వేళ వేసిన తప్పటడుగు వీరి రాజకీయ భవితవ్యానికి శాపంలా మారింది. నిజానికి వైసీపీ అధికారంలోకి వచ్చివున్నా పెద్దిరెడ్డి రాజ్యంలో వీరి ఉనికికి విలువా గౌరవం ఉండే అవకాశం కూడా లేదు.



బోల్తాపడ్డ బోస్

పలమనేరుకు చెందిన టీడీపీ సీనియర్ నేత సుభాష్ చంద్రబోస్ ఎన్నికలకు ముందు జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. బాలాజీ సహకార సూపర్‌మార్కెట్‌కు రెండు దశాబ్దాలకుపైగా చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈయనకు పట్టణంలో మంచి పేరుంది. 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి, వైసీపీ అభ్యర్థి అమరనాథరెడ్డి చేతిలో ఓటమి చెందారు. 2017లో అమరనాథరెడ్డి టీడీపీలో చేరి మంత్రి పదవి తీసుకున్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ కోసం పనిచేసినా పార్టీ అధికారంలోకి రాకపోవడంతో ఈయనకు గుర్తింపు లభించలేదు.ఈ అసంతృప్తిలో ఉన్న సుభాష్‌చంద్రబోస్ తాజా ఎన్నికలకు ముందు వైసీపీలో చేరి వెంకటేగౌడ కోసం పనిచేశారు. వైసీపీ ఘోరంగా ఓటమి పాలవడంతో ఈయన రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. అదే టీడీపీలో ఉండి ఉంటే గుర్తింపు వచ్చేదని, ప్రత్యామ్నాయంగా ఏదో ఒక పదవి దక్కి ఉండేదనే చర్చ పట్టణంలో జరుగుతోంది.



పట్టుజారిన లలితకుమారి

2009వ సంవత్సరానికి ముందు పలమనేరు నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వుడుగా ఉండేది. 2004 ఎన్నికల్లో లలితకుమారి పలమనేరు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 2009లో పలమనేరు జనరల్‌కు కేటాయించడం, కొత్తగా ఏర్పడిన పూతలపట్టు ఎస్సీలకు కేటాయించడంతో ఆమె పూతలపట్టుకు వచ్చారు. 2009, 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ ఆమెకు వరుసగా మూడుసార్లు అవకాశమిచ్చింది. 2009లోనూ, 2014లోనూ వెయ్యి ఓట్ల తేడాతో ఓడిపోయారు. అయితే నియోజకవర్గంలో అంత క్రియాశీలకంగా ఉండని లలితకుమారి ఈసారి కూడా పార్టీ టికెట్ ఆశించారు. రాదని తేలడంతో ఆమె పూతలపట్టులో జగన్ సమక్షంలో వైసీపీలో చేరిపోయారు. తన రాజకీయ భవిష్యత్తుకు తనే అడ్డుకట్ట వేసుకున్నారని ఆమె అనుచరులే వ్యాఖ్యానిస్తున్నారు.



సుబ్రమణ్యంరెడ్డి.. పాపం రెండోసారీ!

కుప్పానికి చెందిన జడ్పీ మాజీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి గతంలోనూ ఇప్పుడూ ఎన్నికలకు ముందే తప్పటడుగు వేసి దెబ్బతిన్నారు. కుప్పంలో చంద్రబాబు మీద 1999, 2004, 2009 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు పోటీ చేసిన నాయకుడిగా సుబ్రమణ్యంరెడ్డికి ప్రత్యేక గుర్తింపు ఉండేది. మంచి భవిష్యత్తును ఆశించి 2019 ఎన్నికలకు ముందు వైసీపీని వీడి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. దురదృష్టం వెంటాడి అప్పుడు వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత నిశ్శబ్దంగా ఉండిపోయిన ఆయన 2024 ఎన్నికలకు ముందు టీడీపీ నుంచి మళ్లీ వైసీపీలో చేరారు. రెండోసారి కూడా దురదృష్టమే సుబ్రమణ్యం రెడ్డిని వెక్కిరించింది. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చింది.



భంగపడ్డ రావూరి

పదేళ్ల పాటు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేసిన రావూరి ఈశ్వరరావు తనకు తగిన గుర్తింపు లేదని 2019 నుంచి నిశ్శబ్దంగా ఉండిపోయారు. చంద్రబాబుకు సన్నిహితుడిగా పేరున్న ఈ బీసీ నేత ఎన్నికలకు ముందు పూతలపట్టులో జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. చిత్తూరు అభ్యర్థి విజయానందరెడ్డి కోసం పనిచేశారు. టీడీపీ నాయకుడిగా ఎప్పుడూ వార్తల్లో కనిపించే ఈయన భవిష్యత్తుకు తాజా పరిణామంతో గండిపడింది. అలాగే చాలాకాలంగా రాజకీయాలకు దూరంగా ఉండిపోయిన చిత్తూరు చివరి మున్సిపల్ చైర్‌పర్సన్ సరళామేరి ఎన్నికలకు ముందు తిరిగి క్రియాశీలకమయ్యారు. వైసీపీలో చేరి విజయానందరెడ్డి కోసం పనిచేశారు. భవిష్యత్తును ఆశించిన ఆమె టీడీపీ గెలుపుతో భంగపడ్డారు.

రెస్కో అధికారుల నిర్లక్ష్యం..

హెల్పర్ మృతి

- రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు



ట్రాన్స్‌ఫార్మర్‌కు వేలాడుతున్న మృతదేహం



ముత్తుకుమార్ మృతదేహం వద్ద గ్రామస్తులు

కుప్పం, జూన్ 8: రెస్కో అధికారుల నిర్లక్ష్యంతో హెల్పర్ మృతి చెందిన ఘటన కుప్పం మండలం గుడ్లనాయనిపల్లె గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని అడవిబూదుగూరు గ్రామానికి చెందిన ముత్తుకుమార్ (22) కుప్పం రెస్కోలో షిఫ్ట్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. విద్యుత్తు సరఫరాలో లోపం ఏర్పడడంతో గుడ్లనాయనిపల్లె గ్రామ సమీపంలోని సబ్ స్టేషన్‌కు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి మరమ్మతు చేయసాగాడు. ఇంతలో హఠాత్తుగా విద్యుత్తు సరఫరా కావడంతో ట్రాన్స్‌ఫార్మర్‌పైనే మృతి చెందాడు. గ్రామస్తులు దీన్ని గమనించి, ఫొటో తీసి వాట్సాప్‌లో పెట్టారు. రెండు గ్రామాల వారు ఇది చూసి సబ్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. రెస్కో అధికారుల నిర్లక్ష్యం వల్లే ముత్తుకుమార్ మృతి చెందాడని ఆరోపిస్తూ రోడ్డుపై ధర్నాకు దిగారు. సబ్ స్టేషన్ సమీపంలో గల ప్లాస్టిక్ పైపుల ఫ్యాక్టరీ యాజమాన్యం ఇష్టారాజ్యంగా విద్యుత్ సరఫరాను ఆపరేట్ చేయడం వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకుంది ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రెస్కో అధికారులు సాయంత్రం వరకు అటు తిరిగి చూడకపోవడంతో మరింత ఆగ్రహావేశాలకు లోనై రోడ్డుపైనే బైఠాయించారు. చివరకు పోలీసులు అక్కడికి చేరుకుని న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కాగా, మృతుడు ముత్తుకుమార్‌కు ఏడాది క్రితమే వివాహమైంది. అతని భార్య బిడ్డకు జన్మనిచ్చి పుట్టింట్లో ఉంది. కుటుంబ పెద్ద మృతితో భార్యాబిడ్డలు దిక్కులేని వారయ్యారు.

ఎన్టీఆర్ సర్కిల్

పేరు నిలబెట్టారు



విగ్రహ స్థాపనలో పాల్గొన్న టీడీపీ నాయకులు

చిత్తూరు సిటీ, జూన్ 8 : చిత్తూరు టీడీపీ నేతలు ఎట్టకేలకు ఎన్టీఆర్ సర్కిల్ పేరును నిలబెట్టారు. 2018లో నగరంలోని గాంధీ సర్కిల్‌ను అప్పటి ఎమ్మెల్యే డీఏ సత్యప్రభ నగర సుందరీకరణలో భాగంగా అభివృద్ధి చేశారు. ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహాన్ని గాంధీ సర్కిల్‌లో ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేశారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అదే ఏడాది అక్టోబర్ 17వ తేదీ రాత్రి అప్పటి ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని ఇతర నేతలు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. కొన్ని గంటల్లోనే విగ్రహ ఏర్పాటుకు అనుమతులు లేవని, తొలగించాలని అధికారులు చెప్పడంతో చేసేదిలేక విగ్రహాన్ని జిల్లా టీడీపీ కార్యాలయానికి తరలించారు. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో శనివారం రాత్రి విగ్రహాన్ని గాంధీ సర్కిల్‌లో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సందీప్, మాజీ మేయర్ కఠారి హేమలత, పార్టీ చిత్తూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజి, తెలుగుయువత అధ్యక్షుడు కాజూరు రాజేష్, బంగారుపాళ్యం మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



ఐరాల(కాణిపాకం), జూన్ 8: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్ర నలుమూలల నుంచి స్వామి దర్శనార్థం వేలాది మంది కాణిపాక క్షేత్రానికి విచ్చేశారు. ఉదయం నుంచే క్యూలన్నీ నిండిపోయాయి. దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. ప్రతి భక్తుడూ సంతోషంగా దర్శనం చేసుకునేలా ఆలయాధికారులు చర్యలు చేపట్టారు.

స్వామి దర్శనార్థం క్యూలో వేచి ఉన్న భక్తులు

కాణిపాక ఆలయ చైర్మన్ రాజీనామా

ఐరాల(కాణిపాకం), జూన్ 8: కాణిపాకం ఆలయ పాలకమండలి అధ్యక్ష పదవికి మోహన్‌రెడ్డి శనివారం రాజీనామా చేశారు. వైసీపీ ఓడిపోయిన తర్వాత నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారంతా రాజీనామాలు చేస్తున్న సంగతి తెలిసిందే. తన రాజీనామా పత్రాన్ని ఆలయ ఈవో వెంకటేశుకు అందించారు. కాగా తనపై నమ్మకం ఉంచి రెండు దఫాలు ఆలయ చైర్మన్‌గా అవకాశం ఇచ్చిన పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డికి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఎమ్మెస్‌బాబుకు మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



ఈవోకు రాజీనామా పత్రాన్ని అందిస్తున్న మోహన్‌రెడ్డి

ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు

- సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే శిక్షిస్తాం
- ఎస్పీ మణికంఠ



చిత్తూరు, జూన్ 8: సోషల్ మీడియా వేదికగా తప్పుడు, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ మణికంఠ హెచ్చరించారు. జిల్లాలో రాజకీయ నాయకుల విగ్రహాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం కలిగిస్తే శిక్షించాల్సి వస్తుందన్నారు. ఎంతటివారైనా వదలిపెట్టేది లేదన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటిలో కొందరు రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్నారనే సమాచారం అందిందని, అలాంటివి మానుకోకపోతే గ్రూపు అడ్మిన్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు. వివాదాస్పద పోస్టులను వెంటనే గ్రూపు నుంచి తొలగించాలన్నారు. శాంతియుత వాతావరణానికి అందరూ సహకరించాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన కోరారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఘనంగా అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం


వివిధ రకాల మొక్కలతో విద్యార్థుల ప్రదర్శన

శాంతిపురం, జూన్ 8 : మండల పరిధిలోని కుతేగానిపల్లె పరమహంస యోగానంద విద్యాలయంలో శనివారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పర్యావరణం వల్ల సమాజానికి కలిగే ప్రయోజనాలను ప్రయోగాల ద్వారా విద్యార్థులు ప్రదర్శించారు. పర్యావరణంపై విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, గ్రీటింగ్ కార్డ్ మేకింగ్, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. అందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనం తరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆజాద్‌హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దబజనవాడ రహదారిని బాగుచేయండి


యామగానిపల్లె-పెద్దబజనవాడ రహదారి గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

గుడుపల్లె, జూన్ 8: మండలంలోని పెద్దబజనవాడ రహదారి వర్షానికి బురదమయమై గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. యామగానిపల్లె నుంచి జంగాల్లపల్లెకు వెళ్లే 3 కిలోమీటర్ల తారురోడ్డు పదేళ్ల క్రితం నిర్మించారు. ఈ రోడ్డులో అక్కడక్కడా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షం పడితే ఈ గుంతల్లో వర్షపు నీరు చేరుతోంది. వాహనదారులు ఆ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఏటా తూతూమంత్రంగా ఈ రహదారిని బాగు చేస్తున్నారని కొన్ని నెలలు తరువాత మళ్లీ గుంతలు ఏర్పడుతు న్నాయని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారిని బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి సిబ్బంది సహకరించాలి



ఆర్టీసీ సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న డీఎం సుధాకరయ్య

పుంగనూరు రూరల్, జూన్ 8: ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి డ్రైవర్లు డీజిల్ పొదుపు చేసి, కండక్టర్లు అధిక కలెక్షన్లు సాధించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పుంగనూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.సుధాకరయ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో అత్యధికంగా హెచ్ఎస్‌డీ ఆయిల్ పొదుపుచేసిన డ్రైవర్లు కె.అన్వర్‌బాషా, సీ.రెడ్డెప్ప, ఎ.జనార్థన్, పల్లెవెలుగు సర్వీసులో ఆదాయం సాధించిన ఆర్.పార్వతమ్మలను అభినందించారు. ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతి డ్రైవర్, కండెక్టర్ విధులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న జనసేన నాయకులు


కొబ్బరి కాయులు కొట్టి మొక్కులు తీర్చుకుంటున్న జనసేన, టీడీపీ నాయకులు

శాంతిపురం, జూన్ 8 : కూటమి అధికారంలోకి రావడంతో జనసేన మండల నాయకుడు రాజేంద్ర ఆధ్వర్యంలో శనివారం అప్పయ్య తోపు ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. 101 కొబ్బరి కాయులు కొట్టి మొక్కులు తీర్చుకొన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భారీ మెజారిటీతో గెలుపొంది, కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే 101 కొబ్బరి కాయలు కొడతామని అప్పయ తోపు ఆంజనేయస్వామికి రాజేంద్ర మొక్కుకున్నారు. ఆ మేరకు పూజలు ఫలించడంతో జనసేన, టీడీపీ నాయకులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో నడింపల్లె పంచాయతీ సర్పంచ్ బాలక్రిష్ణ, గోవిందరాజులు, బసవరాజు, మణి, చలపతి, రాళ్లబూదుగూరు, నడింపల్లె పంచాయతీల కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ముగిసిన వేసవి శిక్షణశిబిరం


శిక్షణ పూర్తి చేసుకున్న పిల్లలు

పుంగనూరు, జూన్ 8: పుంగనూరు గురుకులంలో 46 రోజులుగా 100 మంది పిల్లలకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగిసిందని చెస్ కోచ్ మణికంఠ తెలిపారు. శనివారం స్థానిక కుమ్మరవీధిలోని గురుకులంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెస్‌తో బాటు 10 రకాల క్రీడల్లో పిల్లలకు శిక్షణ, క్రమశిక్షణ, యోగ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. పుంగనూరు, పిచ్చిగుంట్లపల్లె, పాళ్యంపల్లె, బండ్లపల్లెల్లో 100మంది పిల్లలకు చెస్, క్యారమ్స్, షెటిల్, టెన్నికాయిట్, తదితర క్రీడల్లో శిక్షణ ఇచ్చామని వివరించారు. ఈ పోటీల్లో విజేతలైన పిల్లలకు మెడల్స్, సర్టిఫికెట్లు పంపిణీ చేశామని వివరించారు. ఆదివారం పుంగనూరులో 100 పిల్లలకు స్పోర్ట్స్‌డే తరహా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీకే బాబుపై అనుచిత వ్యాఖ్యలు అన్యాయం: టీడీపీ

గుడిపాల, జూన్ 8: చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు ఎవరికీ భయపడే వ్యక్తి కాదని మండల టీడీపీ మాజీ అధికార ప్రతినిధి తుమ్మల సాంబశివనాయుడు, మండల టీడీపీ నాయకులు ఆదాంబాషా పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో వారు మీడియాతో మాట్లాడారు. చిత్తూరులో ప్రధాన వైసీపీ నాయకుడు సీకే బాబు గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు. ఇప్పటికే ప్రజలు వైసీపీ కి తగిన గుణపాఠం చెప్పారని గుర్తుచేశారు. సీకే బాబు గురించి వైసీపీ సర్పంచ్‌కు మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. ఎవరూ ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేయకూడదని తెలియజేశారు. ఇకనైనా వైసీపీ వారు మాట్లేడే సమయంలో ఆలోచించి మాట్లాడాలని హితవుపలికారు. ఈ సమావేశంలో మండల యువత అధ్యక్షుడు శంకర్ చౌదరి, మాజీ సర్పంచ్ రవినాయుడు, శేఖర్, రామూర్తినాయుడు, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అక్షర యోధుడు రామోజీరావు

రామోజీరావుకు టీడీపీ నాయకుల నివాళి, పలుచోట్ల అంజలి ఘటించిన పాత్రికేయులు


కుప్పం, వీ.కోట, పుంగనూరులో ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కుప్పం, జూన్ 8: ఈనాడు సంస్థల ఛైర్మన్ రామోజీరావు అక్షర యోధుడని పలువురు వక్తలు కీర్తించారు. కుప్పంలోని ఆర్టీసీ బస్టాండు కూడలిలో శనివారం రామోజీరావు చిత్రపటం ఏర్పాటు చేసి ఆయనకు నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు పాత్రికేయులు అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, చంద్ర బాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పార్టీ కుప్పం మున్సిపల్, మండల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, సత్యేంద్రశేఖర్, గోపీనాథ్, వీజీ. ప్రతాప్, సత్యేంద్ర, మంజునాథ్, కన్నన్, వేణు గోపాల్, రామచంద్ర, పాత్రికేయులు పాల్గొన్నారు.

పలమనేరు: తెలుగు మీడియా, సినీరంగంలో తనకంటూ ఒక ప్రత్యేకస్థానాన్ని సాధించుకొన్న నిత్యకృషీవలుడు ఈనాడు సంస్థల అధినేత రామోజీరావని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. రామోజీరావు మరణ వార్త తెలుసుకొన్న ఆయన శనివారం పలమనేరులో విలేకరులతో మాట్లాడారు. తన సంతాపాన్ని తెలియజేశారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు.

రామకుప్పం: రామోజీరావుకు రామకుప్పం టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారిలు రామోజీరావు చిత్రపటానికి పూజలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నాయకులు పాల్గొన్నారు. ● రామకుప్పంలో రామోజీరావుకు స్థానిక పాత్రికేయులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు గోకుల్‌కుమార్, జగదీష్, శ్రీనివాసులురెడ్డి, నరేంద్ర, మోహన్, నజీర్, నవీన్‌లు పాల్గొన్నారు.

శాంతిపురం: టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు విజయ రామిరెడ్డి, ఏఎంసీ నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శ్యామల, కుప్పం నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు అనుసూయ, రూప, సుగుణమ్మ, సరిత తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు/కల్లూరు: పుంగనూరు టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు కుమార్, మాధవరెడ్డి, జనసేన నేత పగడాల రమణ, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● కల్లూరు నాలుగురోడ్ల కూడలిలో రామోజీరావు చిత్రపటానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురళీధర్ నాయుడు, ధనంజయనాయుడు, నారాయణస్వామి నాయుడు, పాల్గొన్నారు.

వి.కోట: రామోజీరావు మృతి పట్ల టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్ సంతాపం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. నాయకులు చౌడప్ప, ధీరజ్, నారాయణస్వామి, విశ్వనాథ్, రాము, చిట్టిబాబు, పాల్గొన్నారు.

కంటైనర్‌ను ఢీకొని కారు బోల్తా

● ముగ్గురికి గాయాలు

గుడిపాల, జూన్ 8: చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలో శనివారం తెల్లవారుజామున కంటైనర్ ఢీకొని కారు బోల్తాపడిన ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. మురకంబట్టు నుంచి వేలూరు వైపు వెళ్తున్న కారును వెనుకవైపు నుంచి కంటైనర్ ముట్టుకూరుపల్లి మలుపు వద్ద ఢీకొంది. డ్రైవర్ అదుపు చేయలేకపోవడంతో కారు పల్టీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

జడ్పీ మాజీ సీఈవోపై చర్యలు తీసుకోండి

● కలెక్టర్‌కు టీడీపీ నాయకులు ఫిర్యాదు

చిత్తూరు రూరల్, జూన్ 8: జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి చేసిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నేత చంద్రప్రకాష్‌లు కలెక్టర్ షణ్మోహన్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యా లయంలో కలెక్టర్‌ను కలిసి సీఈవో అక్రమాలపై ఫిర్యాదు చేశారు. వారు మాట్లా డుతూ టీడీపీ నాయకులు, సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు ఇప్పటికీ బిల్లులు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐదేళ్ల క్రితం చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా, వైసీపీ నాయ కులు చేసిన కొత్త పనులకు బిల్లులు మంజూరు చేశారని ఆరోపించారు. అప్పులు చేసి పనులు చేసిన వారు బిల్లులు మంజూరు కాక, వడ్డీలు కట్టలేక, అప్పులు చెల్లించలేక అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విచారణ చేయాలని జేసీకి రాసినట్లు వారు తెలిపారు.

వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, జూన్ 8: దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలోని వన వేణుగోపాల స్వామికి శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకులు కె.కార్తీక్ అయ్యంగార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని అలంకరించారు. ఈ క్రమంలో క్షీరాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజాది కార్యక్రమాలు జరిగాయి. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదం చేశారు. ప్రధాన కార్యనిర్వాహకులు శివ కుమార్, సుబ్రహ్మణ్యంరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాతల సాయంతో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రధాన కార్యనిర్వాహకులు శివకుమార్, సుబ్రహ్మణ్యంరెడ్డి ప్రారంభించారు. విద్యుత్ లైన్ కోసం సాయం చేసిన దాతల సేవలను కొనియాడారు.

నారా భువనేశ్వరిని కలసిన భానుప్రకాష్

నగరి జూన్8: నగరి ఎమ్మెల్యేగా ఎన్నికైన గాలి భానుప్రకాష్ శనివారం టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని కలిశారు. ఆమె ఆశీస్సులు పొందారు. నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలుపొందిన భానుప్రకాష్‌ను ఆమె అభినందించారు. అభివృద్ధి పనులు చేసి ప్రజల మన్ననలు పొందాలని భువనేశ్వరి సూచించారు.

11న గుడుపల్లె మండల సమావేశం

గుడుపల్లె, జూన్ 8: గుడుపల్లె మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 11వ తేదీ మంగళ వారం ఉదయం 10.30 గంటలకు స్త్రీశక్తి భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎన్ గోపి తెలిపారు. అన్ని శాఖల అధికారులు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు తప్పక హాజరు కావాలని కోరారు. ఆయా శాఖల అధికారుల తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికను తప్పక తీసుకురావాలని కోరారు.

నేడు జనసేన మండల సమావేశం

గుడుపల్లె, జూన్ 8: గుడుపల్లె జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు అమీర్ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతం



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

కుప్పం, జూన్ 8: కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, పీఈఎస్ ఆస్పత్రి వారి సౌజన్యంతో శనివారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం వియవంతమైంది. 20 మందిని కంటి శస్త్ర చికిత్సల కోసం పీఈఎస్‌కు సిఫార్సు చేసినట్లు లయన్స్ క్లబ్ రీజనల్ ఛైర్మన్ ఎమహేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి పీజీ.సెల్వం, కోశాధికారి ప్రసాద్, సభ్యులు చరణ్, కృష్ణమూర్తి, లెనిన్, కేఈసీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు మాధవన్, గంగాధర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నంజంపేట రోడ్డుపై వర్షపునీరు



సోమల, జూన్ 8: సోమల -నంజంపేట ప్రధాన రహదారిలోని సోమల సచివాలయం వద్ద రోడ్డుపై వర్షపు నీరు నిలిచి పాదచారులకు, వాహనదారులకు ప్రయాణం ఇబ్బందిగా మారింది. సోమల నుంచి నంజంపేట వరకు పలుచోట్ల ఇలాంటి పరిస్థితి ఉన్నా రోడ్డు భవనాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

రెట్టింపు విశ్వాసం పొందేలా టీడీపీ పాలన


సన్మాన సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, జూన్ 8: ప్రజలు టీడీపీపై విశ్వాసంతో వైసీపీ రాక్షస పాలనను అంతమెందించారని వారి విశ్వాసం రెట్టింపయ్యేలా పాలన అందుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం తెలిపారు. శనివారం రామకుప్పంలోని వాసవీ సత్రంలో స్థానిక ఆర్యవైశ్య సంఘం వారు రాష్ట్రంలో కూటమి, కుప్పం చంద్రబాబు ఘనవిజయం సాధించడంతో నేతలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎటుచూసినా అరాచకం, దౌర్జన్యాలు పెచ్చుమీరాయన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఎటువంటి భయం లేకుండా ప్రశాంతంగా జీవించేలా పాలన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు సతీష్, దయానంద, బద్రీనాథ్, రవికుమార్, సుబ్బన్న, సోమేశ్వర్, ప్రభాకర్, చంద్రశేఖర్, శేఖర్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో పంటలకు తెగుళ్లు ..ఆందోళనలో అన్నదాత

గుడుపల్లె, జూన్ 8: మండలంలోని ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులకు నష్టం వాటిల్లింది. రైతులు బోర్ల నీటిపై ఆధారపడి కూరగాయలు పంటలు సాగుచేశారు. దిగు బడి చేతికి వస్తున్న తరుణంలో ఎడతెరపి లేకుండా వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ వర్షాలకు టమోటా, మిరప, బీన్స్ పంటలకు అగ్గి తెగులు సోకింది. తెగుళ్ల నివారణకు కోసం అనేక రకాల మందులు పిచికారి చేసిన ప్రయోజనం లేకుండా పోతోందని విచారం వ్యక్తం చేస్తున్నారు. నేలలో తేమశాతం పెరిగి దిగుబడుల్లో నాణ్యత లోపించడం వల్ల వేలకు వేలు పెట్టుబడులు పెట్టినా ప్రస్తుతం నష్టాలకు గురికావాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


జోగిండ్లులో వర్షానికి తెగులు సోకిన మిరప పంట, అగరంలో వర్షానికి దెబ్బతిన్న టమోటా పంట

టీడీపీ కార్యాలయంలో వెలుగు సిబ్బంది సందడి


విశ్వనాథనాయుడుకు స్వీట్ తినిపిస్తున్న ఏపీఎం గ్రీట, ఇతర సిబ్బంది

శాంతిపురం, జూన్ 8 : శాంతిపురం మండల టీడీపీ కార్యాలయంలో వెలుగు సిబ్బంది శనివారం సందడి చేశారు. ఏపీఎం గ్రీట, సీసీలు గోపి, భాగ్యలక్ష్మి, రామచంద్ర, క్రిష్ణ, సంఘమిత్రలు మంగమ్మ, రాజు, సంగీత, బాబు, దుర్గ, శ్యామల, అరుణ, మహ్మద్, కుప్పస్వామి, సుబ్రమణ్యం, మంజునాథ్, సునీల్, ప్రసాద్, గీత, వెలుగు అకౌంటెంట్ యాస్మిన్‌తో పాటు ఇతర వెలుగు సిబ్బంది పార్టీ కార్యాలయంలోకి వెళ్లి మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడుకు, ఇతర నాయకులకు శాలువలు కప్పి గజమాలతో సన్మానించారు. అందరికీ స్వీట్లు పంచారు. ఏపీఎం గ్రీట, సీసీలు నేతలకు స్వీట్లు తినిపించారు. అభినందనలు తెలిపారు. కొందరు నాయకులు మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్న అధికారులు ప్రజలకు సేవకులుగా పనిచేయాలన్నారు. అప్పుడే ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, రమేష్, ఏఎంసీ నాగరాజు, సుబ్రమణ్యం, అనుసూయ, శ్యామల, రూప, తదితరులు పాల్గొన్నారు.

రక్తి కట్టించిన ఇలామంతుడి వధ

సోమల, జూన్ 8: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ భారతంమిట్టలో మహా భారత యజ్ఞంలో భాగంగా శనివారం ఇలామంతుని వధ నాటక ప్రదర్శన రక్తి కట్టిం చారు.ఉదయం ధర్మరాజుల ఆలయంలో మూల విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం ఇలామంతుని ప్రతిమను ఆలయం ఎదుట ఏర్పాటు చేసి పీలేరు నాటక మండలి సభ్యులు నాటక ప్రదర్శన చేసి మెప్పించారు. ద్రౌపతీదేవి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదారులు దొరబాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

దాడి కేసులో ఏడుగురిపై కేసు

శ్రీరంగరాజపురం, జూన్ 8: ఎస్ఆర్‌పురం మండల టీడీపా అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు ఇంటిపై గురువారం రాత్రి చిట్టిబాబు నాయుడు వర్గీయులు చేసిన దాడికి సంబంధించి పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సత్యనారాయణమూర్తి శనివారం మీడియాతో మాట్లాడుతూ రాజశేఖర్ నాయుడు ఇంటిపై కొంత మంది కొన్ని కారణలతో దాడికి పాల్పడ్డారన్నారు. బాధితుడు రాజశేఖర్‌నాయుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో ఏడుగురిపై నమోదు చేశామన్నారు. అన్ని వర్గాలూ సంయమనం పాటించాలని కోరారు. రాజశేఖర్ నాయుడు కుటుంబాన్ని ఆరు మండలాల టీడీపీ అధ్యక్షులు, డాక్టర్ థామస్ సోదరుడు నిధి. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పరామర్శించారు.

నాలుగు టిప్పర్ల ఇసుక సీజ్

నగరి జూన్8: నగరి మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై శనివారం అధికారులు దాడులు చేశారు. నాలుగు టిప్పర్లను సీజ్ చేశారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి సెబ్ ఎస్ఐ కృష్ణ నాయక్ స్పందించారు. ఆయన ఆధ్వర్యంలో సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఇసుక డంపింగ్ వద్ద దాడులు జరిపారు. టిప్పర్‌కు రూ20వేల వంతున జరిమానా విధించారు. 250 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు.

నీటికుంటగా మారిన సర్వీసు రోడ్డు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు ● పట్టించుకోని జాతీయ రహదారి అధికారులు


నాగమంగళం వద్ద ఫ్లై ఓవర్ వద్ద నీటికుంటగా మారిన సర్వీస్ రోడ్డు

పలమనేరు, జూన్8 : పలమనేరు వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం బైపాస్ రోడ్డు నిర్మించింది. ఈ బైపాస్ రోడ్డులో భాగంగా పట్టణ సమీపంలోని నాగమంగళం వద్ద ఒక ఫ్లై ఓవర్ నిర్మించారు. ఈ ఫ్లై ఓవర్ వద్ద సర్వీసు రోడ్డు నిర్మించారు. ఈ సర్వీసు రోడ్డు కొద్దిపాటి వర్షం కురిసినా మోకాళ్లలోతు నీరు నిలబడి పోతోంది. ఎగువ భాగంలో ఉన్న పొలాల నుంచి వర్షపు నీరు ఈ సర్వీసు రోడ్డుపైకి వచ్చి నిలిచిపోతోంది. ఈ సర్వీసురోడ్డు పక్కన పేరుకు కాలువ నిర్మించినా నీరు ఈ కాలువగుండా ప్రవహించేందుకు వీలులేకుండా నిర్మించారు. ఫలితంగా నీరంతా సర్వీసు రోడ్డుపైకి వచ్చి నీటికుంటను తలపిస్తోంది. వర్షం కురిసిన తరువాత కనీసం వారం రోజుల పాటు ఈ నీరు ఇలాగా వుండిపోతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక ఈ సర్వీసు రోడ్డుపై అక్కడక్కడా గుంతలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో వాలాలు, కార్లలో వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురవు తు న్నారు. ఇకనైనా జాతీయ రహదారి అధికారులు స్పందించి వర్షపు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పన్నికట్టు @ రామిరెడ్డి పాళెం

ఆదివారం ప్రత్యేకం

కంచి అనగానే మగువలకు గుర్తొచ్చేది అందమైన పట్టుచీరలు.ఇక్కడ తయారయ్యే పట్టు, బంగారు, వెండి, జరీ చీరలకు దేశవ్యాప్తంగా ఎంతో క్రేజ్ . ఈ కంచిపట్టు చీరల తయారీ వెనుక నేతన్నల కష్టంతో పాటు పన్నికట్టు కళాకారుల సృజనాత్మకత కూడా దాగి వుంది.







పన్ని తయారీకి ఉపయోగించే జొన్న దంటు, వెదురు పుల్లలు



- ప్రధాని ప్రశంసలందుకున్న పన్నికట్టు కళాకారులు
- కంచి పట్టుచీరల తయారీలో 'పన్ని' ప్రధాన భూమిక

ప్రధాని ప్రశంసలు

ఆజాదీకా అమృత మహోత్సవ్ ఉత్సవాల్లో భాగంగా స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిన చేనేత రంగంలో దేశవ్యాప్తంగా నిష్ణాతులైన కార్మికులను కేంద్ర ప్రభుత్వం సన్మానించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గత ఏడాది ఆగస్టు 7వ తేదీన జరిగిన జాతీయ చేనేత దినోత్సవంలో కేంద్ర ప్రభుత్వం రామిరెడ్డిపాళెం పన్ని కళాకారులను ఆహ్వానించి గౌరవించింది. గ్రామానికి చెందిన పన్ని కళాకారులు షేక్ బషీర్, షేక్ వహీద్ ఢిల్లీలోని ప్రగతి భవన్‌లో జరిగిన చేనేత ప్రదర్శనకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి పన్ని తయారీ గురించి ప్రత్యక్షంగా వివరించి మన్ననలందుకున్నారు.

సత్యవేడు, జూన్ 8 : కంచి పట్టుచీరల తయారీలో పన్ని అనే పరికరం ప్రధాన భూమిక పోషిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే 'పన్ని' లేనిదే కంచి పట్టు చీరల తయారీ కుదరదు. పొందూరు ఖాదీ తయారీలో 'వాలుగ చేప దవడ' పరికరం ఎంత ముఖ్యమో, కంచి పట్టుచీరల తయారీలో కూడా ఈ పన్ని అంతే ముఖ్యం. పట్టు వస్త్రాల తయారీలో నిలువు, అడ్డు పోగులను సరైన క్రమంలో అమర్చే పరికరం పేరే పన్ని. కంచి పట్టు చీరల తయారీకి అవసరమయ్యే 'పన్ని' మన రాష్ట్రంలో రెండు ప్రాంతాల్లోనే తయారు చేస్తారు. ఒకటి నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు కాగా, రెండు మన జిల్లాలోని వరదయ్యపాళెం మండలంలోని రామిరెడ్డి పాళెం.ఈ రెండు ప్రాంతాల నుంచే కంచికి పన్ని సరఫరా అవుతోంది. జొన్నదంటు, వెదురు పుల్లలు చీల్చి తయారు చేసే ఈ పరికరాన్ని కంచి నేతన్నలకు సరఫరా చేస్తూ ఇక్కడి కళాకారులు జాతీయ ఖ్యాతి దక్కించుకున్నారు.బయటి ప్రపంచానికి పెద్దగా తెలియని ఈ పన్నికట్టు కళను చూసి ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఇటీవల ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ కళాకారులను ప్రశంసించారు. వరదయ్యపాళెం మండలం రామిరెడ్డి పాళెంలో 30 కుటుంబాలు ఈ పన్నికట్టు మీదనే ఆధారపడి బ్రతుకుతున్నాయి.పూర్వీకుల నుంచి వారసత్వంగా అందిన ఈ కళను బ్రతికించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చేనేత కార్మికుల తరహాలో ప్రభుత్వాలు తమను ఆదరించక పోయినా నమ్ముకున్న ఈ వృత్తిని, అరుదైన ఈ కళను అంతరించి పోకుండా కాపాడుకుంటూ, తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

పన్ని తయారీ విధానం

తమిళనాడు రాష్ట్రం ధర్మపురి నుంచి జొన్న దంటు, బుచ్చినాయుడు కండ్రిగ మండలం పెళ్కూరు నుంచి వెదురు పుల్లలు సేకరించుకుని బాగా ఎండబెడతారు. ఎండిన జొన్నదంటును మూడు నుంచి, మూడున్నర ఇంచీల లెక్కన సుమారు మూడువేల పుల్లలను సన్నగా చీల్చుకుంటారు.వీటిని గూటంలో పేర్చి పదునైన చిన్నపాటి కత్తులతో గరుకుల్లేకుండా మృదుత్వం వచ్చే వరకు చివ్వుకుంటారు. అనంతరం బాగా ఎండిన వెదురు పుల్లలను ఒకటిన్నర సెంటీమీటర్ మందంతో నాలుగు దబ్బలుగా చీల్చుకుంటారు. చీల్చిన దబ్బల నుంచి పైన రెండు దబ్బలు, కింద రెండు దబ్బలను మూడు అంగుళాల వెడల్పు పెట్టి ఒక ప్రత్యేక పరికరంలో అమర్చుకుంటారు. ఈ వెదురు దబ్బల సందుల్లోంచి, చీల్చిన జొన్నదంటు పుల్లలను ఒక్కొక్కటిగా పేర్చుకుంటూ దారంతో కడుతూ ముడి వేస్తారు. ఇలా మూడువేల జొన్నదంటు పుల్లలను కట్టి పన్ని తయారు చేస్తారు. ఒక్క పన్ని తయారు చేయాలంటే సుమారు రెండు రోజులు పడుతుంది. ఈ మొత్తం ప్రక్రియలో ఇంటిల్లిపాదీ సహనంతో పని చేయాల్సి ఉంటుంది. ఇంత చేసినా ఒక్క పన్ని విక్రయిస్తే వారికి దొరికేది రూ.వెయ్యికన్నా తక్కువే. అదే వారి కూలి, అదే లాభం కూడా.

అంతరించిపోతున్న అరుదైన కళ

పన్ని కళాకారులను ప్రభుత్వాలు గుర్తించకపోవడంతో పాటు శ్రమకు తగిన ప్రతిఫలం లేకపోవడంతో ప్రస్తుతం ఈ వృత్తిలోకి కొత్తగా ఎవరూ రావడం లేదు. పూర్వీకుల నుంచి తమకు వారసత్వంగా అబ్బిన ఈ వృత్తిపై ఉన్న మమకారంతో కొంతమంది వదులుకోలేక కొనసాగుతున్నారు. ప్రస్తుతం రామిరెడ్డి పాళెంలో 30 కుటుంబాల వారు మాత్రమే ఈ వృత్తిలో వున్నారు.అంతరించి పోతున్న ఈ అరుదైన కళను ప్రభుత్వం ప్రోత్సహించి, కాపాడాల్సిన అవసరం ఉంది.

ఇంటిల్లిపాదీ పనిచేస్తాం



ఇంటిల్లిపాదీ రెండు రోజులు పనిచేస్తే ఒక పన్ని తయారవుతుంది.దాన్ని విక్రయిస్తే ఖర్చులు పోనూ రూ.వెయ్యి కూడా మిగలడం లేదు. అరుదైన ఈ కళ అంతరించిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. చేనేత రంగానికి అందించే సంక్షేమ పథకాలు, సబ్సిడీ రుణాలు అందించి ఆదుకోవాలి.

- ఎస్‌కే బాషా

ప్రభుత్వం ఆదుకోవాలి



చేనేత మగ్గాలకు పన్ని ఊపిరిలాంటిది. పన్ని లేనిదే పట్టుచీరలు నాణ్యతగా తయారీ కాదు. తరతరాలుగా మేము పన్ని తయారీలోనే బ్రతుకుతున్నాం. ఇది చాలా ఓర్పుతో కూడుకున్న పని.కూర్చున్న చోటు నుంచి కదలకుండా గంటలపాటు ఉండాల్సి వస్తుంది. ఇది పన్ని కళాకారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొద్ది కాలానికే శరీరం పటుత్వం కోల్పోతుంది. నేత కార్మికులను ఆదుకున్నట్లే మమ్మల్ని కూడా ప్రభుత్వం ఆదరించాలి. వారిలాగే సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. నేత కార్మికులకు ఇచ్చినట్లే పింఛన్ కూడా మంజూరు చేయాలి.

- షేక్ బషీర్ సాహెబ్

వైసీపీలో అంతర్మథనం

భవిష్యత్తుపై బెంగ - టీడీపీ గూటికి చేరేందుకు రాయబారాలు

పుత్తూరు అర్బన్, జూన్ 8: వైసీపీలో అంతర్మథనం మొదలైంది. టీడీపీ సాధించిన అసాధారణ విజయంతో వైసీపీ కేడర్ డోలాయమానంలో పడింది. తమ భవిష్యత్తుపై బెంగ పెట్టుకుంది. టీడీపీ గూటికి చేరేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకు ఆయా మండలాల్లో కీలక నాయకులతో టచ్‌లోకి వెళుతోంది.


రానున్న ఐదేళ్లు ఎలాగబ్బా... : రోజా అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ ఎన్నికలకు ముందే ఒక్కొక్క కీలక నాయకుడూ పార్టీకి గుడ్‌బై చెప్పేస్తున్నా, సంక్షేమ పథకాలు గెలిపిస్తాయనే నమ్మకం కొందరిలో ఉండేది. అయితే గాలి భానుప్రకాష్ 45,004 ఓట్ల మెజార్టీతో గెలిచాక గానీ రోజాపై నియోజకవర్గంలో ఇంత వ్యతిరేకత ఉందనే విషయం తెలియలేదు. దీంతో తమ భవిష్యత్తుపై బెంగ పెట్టుకుంటున్నారు. గత రెండు ఎన్నికల్లో నగరి నుంచి వైసీపీ బొటాబొటీ మెజార్టీతో గెలిచింది. దీంతో వాపును చూసి బలుపనుకుని అధికారం ఉన్న ఐదేళ్లలో టీడీపీ కేడర్‌ను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ నాయకులు ఇప్పుడు బెంబేలెత్తిపోతున్నారు. భవిష్యత్తును తలుచుకుని లోలోన కుమిలిపోతున్నారు. మరోవైపు రెండు రోజులుగా మండలాల వారీగా నగరిలో మాజీ ఎమ్మెల్యే రోజా ఫలితాలపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అండగాఉంటానని భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే కేడర్‌లో మాత్రం ఆత్మస్థైర్యం నింపలేకపోతున్నారు. ఎన్నికలకు ఇంకా ఐదేళ్ల సమయం ఉండడంతో టీడీపీతో రాజకీయ పోరాటం చేయగలమా అనే సందేహంలో పడిపోయారు.

టీడీపీతో రాయబారాలు : పుత్తూరు, నగరి మున్సిపాలిటీలకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు టీడీపీతో టచ్‌లోకి వెళుతున్నారు. గత ఐదేళ్లలో తాము టీడీపీ కేడర్‌ను ఎలాంటి ఇబ్బందులు పెట్టలేదని సంజాయిషీ ఇచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏ పరిస్థితుల్లో తాము వైసీపీలో కొనసాగాల్సి వచ్చిందనే విషయాలను ఏకరువు పెడుతున్నారు. టీడీపీ గూటికి చేరేందుకు లైన్ క్లియర్ చేయించమని అడుగుతున్నారు. అయితే నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మనసు తెలిసిన టీడీపీ నాయకులు ఈ విషయాన్ని ఆయన ముందు ఉంచేందుకు మాత్రం సాహసించలేకపోతున్నారు. భానుప్రకాష్ వైఖరి ఎలా ఉంటుందో అని ఆందోళన చెందుతున్నారు. గత ఐదేళ్లలో నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ నాయకులు చేసిన దోపిడీపై విచారణ జరిపిస్తానని భానుప్రకాష్ ప్రకటించడం వారిలో గుబులు రేపుతోంది.

రేపటినుంచి ఎస్వీయూలో తరగతులు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 8: ఎస్వీయూనివర్సిటీలో సోమవారం నుంచి పీజీ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఆదివారంతో వేసవి సెలవులు ముగియనున్నాయి. దీంతో పీజీ 4, 2వ సెమిస్టర్ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు యూనివర్సిటీ అధికారులు సర్క్యులర్ జారీ చేశారు.

గంగన్న శిరస్సు జలపాతంలో పర్యాటకుల సందడి



పలమనేరు, జూన్8 : పలమనేరు మండలం మండిపేట కోటూరు అటవీ ప్రాంతంలోని గంగన్న శిరస్సు జలపాతం వద్ద పర్యాటకుల సందడి మొదలైంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గంగన్న జలపాతం ఇప్పుడిప్పుడే ప్రవహిస్తోంది. పట్టణ ప్రజలు జలపాతాన్ని సందర్శిస్తున్నారు. మండలంలోని కల్యాణరేవుల జలపాతంలో వర్షాకాలంలో మూడు నెలలకు పైగా పర్యాటకుల సందడి ఉంటుంది. కౌండిన్య నదీ జలాలు ప్రవహించే రోజుల్లో ఈ జలపాతం ఆకట్టుకునేలా ఉంటుంది. బైరెడ్డిపల్లి మండలం కైగల్ నదీ పరివాహక ప్రాంతంలో దుముకురాళ్ల జలపాతం వర్షాకాలంలో పర్యాటకులతో కళకళలాడుతుంది. ఈ మూడు జలపాతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. అంతేగాక కైగల్ నదీజలాలు తమిళనాడుకు తరలిపోకుండా ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

మేకలు కనిపించలేదని విద్యార్థి ఆత్మహత్య

వి.కోట, జూన్ 8: మేకలు కనిపించలేదని మండలంలోని యాలకల్లు పంచాయతీ ఎర్రినాగేపల్లె గ్రామానికి చెందిన కోదండప్ప కుమారుడు సంజయ్(11) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 5వ తరగతి చదువుతున్న సంజయ్ పాఠశాలకు సెలవులు కావడంతో వారికున్న మేకలను మేపేందుకు అడవికి తోలుకెళ్లాడు. సాయంత్రానికి వాటిలో కొన్ని కనిపించకపోవడంతో ఇంటికెళితే తిడతారని భయపడ్డాడు. దీంతో పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. తోటి కాపరులు ఈ విషయాన్ని గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. వి.కోట పోలీసులు అక్కడికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బర్డ్‌లో రోగులకు కృత్రిమ అవయవాల వితరణ



తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బర్డ్ ఆస్పత్రిలో శనివారం 110 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను వితరణ చేశారు. ఇటీవల తమిళనాడు ధర్మపురికి చెందిన సుబ్రమణియన్ అనే దాత బర్డ్ ఆస్పత్రిలో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ఆధునికీకరణకు రూ.కోటి విరాళంగా అందించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా యూకే సాంకేతికతో ఎండోలైట్ కంపెనీ సహకారంతో తయారు చేసిన ఎక్కువ మన్నిక గల కృత్రిమ అవయవాలను ఉచితంగా ఇచ్చారు. బర్డ్ ఆస్పత్రి చేస్తున్న సేవలకుగాను ఎండోలైట్ కంపెనీ అసలు ధరలో 50శాతం రాయితీతో అల్యూమినియంతో తయారు చేసిన ఈకృత్రిమ అవయవాలను టీటీడీకి అందించారు. ఇవి సౌకర్యవంతంగా ఉన్నాయని రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. బర్డ్ ఆస్పత్రి డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది, రోగుల బంధువులు పాల్గొన్నారు.

ఆగని ఏనుగుల దాడులు

మామిడి, టమాట తోటలు ధ్వంసం





దెబ్బతిన్న మామిడి చెట్లు, టమాట తోట - టమోటా పంటను నాశనం చేసిన ఏనుగుల గుంపు

సోమల/కల్లూరు, జూన్ 8: సోమల, కల్లూరు మండలాల్లో ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. సోమల మండలం పేటూరు, అన్నెమ్మగారిపల్లె పంచాయతీ ఎర్రగుంతలపల్లె, పొలికిమాకులపల్లె, కల్లూరు మండలం కోటపల్లె సమీపంలోని అటవీ శివారు పొలాల్లోకి శుక్రవారం రాత్రి, శనివారం పట్టపగలే జంట ఏనుగులు వచ్చాయి. పేటూరుకు చెందిన చిట్టి, చంద్రయ్య, సుబ్రమణ్యం మామిడి, టమాట తోటలను తొక్కి నాశనం చేశాయి. డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. పంటలతోపాటు మామిడి చెట్లు ధ్వంసం కావడంతో రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. మామిడి చెట్లు నేల కూలడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. టమాట, మామిడికి మంచి ధర ఉందని, ఉన్న కొద్దిపాటి పంటను ఏనుగులు నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్లూరుకు చెందిన రైతు యాసిన్ మామిడి తోటలో టమోటా సాగుచేయగా ఏనుగులు ధ్వంసం చేశాయి. ఈ విషయమై అటవీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

టీ20 ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నీ ప్రారంభం

తిరుపతి(క్రీడలు), జూన్ 8: తుమ్మలగుంట క్రీడా మైదానంలో సౌత్‌జోన్ సీనియర్ టీ20 ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నీ శనివారం ప్రారంభమైంది. లీగ్ దశ పోటీల్లో భాగంగా ఉదయం జరిగిన తొలి మ్యాచ్‌లో అనంతపురం-కడప జట్లు తలపడ్డాయి. కడప జట్టు పొదుపైన బౌలింగ్, చురుకైన ఫీల్డింగ్‌తో ప్రత్యర్థిని 138పరుగుల తక్కువ స్కోరుకే కట్టడిచేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కడపజట్టు 7వికెట్లు కోల్పోయి 13బంతులు మిగిలి వుండగానే లక్ష్యాన్ని ఛేదించింది. మధ్యాహ్నం మ్యాచ్‌లో చిత్తూరు-కర్నూలు జట్లు తలపడ్డాయి. కర్నూలు జట్టులోని బ్యాట్స్‌మెన్స్ రాణించడంతో 169పరుగులతో భారీ స్కోరు చేసింది. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరుజట్టు దీటుగా పరుగుల చేసినా.. విజయం ముగింట చతికిల పడింది. కేవలం ఏడు పరుగుల తేడాతో ఓటమి చవి చూసింది.

11న అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఈనెల 11వ తేదీన 11వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం జరగనుంది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఈకార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అయోధ్యకాండలోని 40 నుంచి 44వ సర్గ వరకు ఉన్న మొత్తం 162 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 187 శ్లోకాలను పారాయణం చేస్తారు. ఎస్వీ వేదవిజ్ఞానపీఠం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, టీటీడీ వేదపండితులు, సంభావన పండితులు, అన్నమాచార్య ప్రాజెక్ట్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పండితులు ఈకార్యక్రమంలో పాల్గొంటారు. ఎస్వీబీసీ ప్రత్యక్షప్రసారం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు ఈ పారాయణంలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని టీటీడీ కోరింది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.20 కోట్లు

తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.20 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 63,830 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా 30,810 మంది తలనీలాలు సమర్పించారు. కాగా, శనివారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు రవితేజ శ్రీవారిని దర్శించుకున్నారు.

వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం


ప్రధాన కార్యనిర్వాహకుడికి సన్మానం

వెదురుకుప్పం, జూన్ 8: దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలోని వన వేణుగోపాలస్వామికి శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకులు కె.కార్తీక్ అయ్యంగార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని అలంకరించారు. ఈ క్రమంలో క్షీరాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజాది కార్యక్రమాలు జరిగాయి. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం అన్నప్రసాదం చేశారు. ప్రధాన కార్యనిర్వాహకులు శివకుమార్, సుబ్రహ్మణ్యంరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాతల సాయంతో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రధాన కార్య నిర్వాహకులు శివకుమార్, సుబ్రహ్మణ్యంరెడ్డి ప్రారంభించారు. విద్యుత్ లైన్ కోసం సాయం చేసిన దాతల సేవలను కొనియాడారు. కార్యనిర్వాహకులను సత్కరించారు.

సీకే బాబుపై అనుచిత వ్యాఖ్యలు తగవు:టీడీపీ

గుడిపాల, జూన్ 8: చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు ఎవరికీ భయపడే వ్యక్తి కాదని మండల టీడీపీ మాజీ అధికార ప్రతినిధి తుమ్మల సాంబశివనాయుడు, మండల టీడీపీ నాయకులు ఆదాంబాషా అన్నారు. శనివారం మండల కేంద్రంలో వారు మీడియాతో మాట్లాడుతూ చిత్తూరులో ప్రధాన వైసీపీ నాయకుడు సీకే బాబు గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు. ఇప్పటికే ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. సీకే బాబు గురించి వైసీపీ సర్పంచ్‌కు మాట్లాడే అర్హత లేదన్నారు. దిగజారుడు రాజకీయాలు చేయకూడదన్నారు. ఇకనైనా ఆలోచించి మాట్లాడాలని హితవు పలికారు. మండల యువత అధ్యక్షుడు శంకర్ చౌదరి, మాజీ సర్పంచ్ రవినాయుడు, శేఖర్, రామూర్తినాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ జెండాల ఆవిష్కరణకు సన్నాహాలు


జెండా ఎగురవేతకు ఏర్పాట్లు

గుడిపాల, జూన్ 8: గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో టీడీపీ ప్రతిపక్ష పార్టీని క్లీన్ స్వీప్ చేయడంతో మండల్లో ఫుల్ జోష్ పెరిగింది. దీంతో గ్రామ పంచాయతీల్లో టీడీపీ జెండాలను ఎగురవేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ప్రతి పంచాయతీలో జెండాలు ఆవిష్కరించడానికి చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే గట్రాళ్ళమిట్టలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ జెండాలను ఎగురవేయడానికి స్తంభాలను సిద్ధం చేస్తున్నారు.

పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్ల రాజీనామా

నగరి జూన్8:నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ తిరుమలరెడ్డి, డైరెక్టర్‌లు దామోదరం నాయుడు, నాగరత్నంలు శనివారం తమ పదవులకు రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలరీత్యా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రాజీనామా పత్రాలను జిల్లా విభాగ సహకారశాఖ అధికారి వనజకు అందజేశారు.

నారా భువనేశ్వరిని కలసిన భానుప్రకాష్



నగరి జూన్8: నగరి ఎంఎల్ఏగా ఎన్నికైన గాలి భానుప్రకాష్ శనివారం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరిని కలిశారు. ఆమె ఆశీస్సులు పొందారు. నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలుపొందిన భానుప్రకాష్‌ను ఆమె అభినందించారు. అభివృద్ధి పనులు చేసి ప్రజల మన్ననలు పొందాలని ఈ సందర్భంగా భువనేశ్వరి సూచించారు.

వరసిద్ధుడి సేవలో యూడీసీ ఎండీ



ఐరాల(కాణిపాకం), జూన్ 8: ఆంధ్రప్రదేశ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ హరిత శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆమెను ఈవో వెంకటేశు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆమె వెంట ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటిండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఏడుగురిపై కేసు నమోదు


దాడిపై విచారిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

శ్రీరంగరాజపురం, జూన్ 8: ఎస్ఆర్‌పురం మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు ఇంటిపై గురువారం రాత్రి చిట్టిబాబు నాయుడు వర్గీయులు చేసిన దాడికి సంబంధించి పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సత్యనారాయణ మూర్తి శనివారం మీడియాతో మాట్లాడుతూ రాజశేఖర్ నాయుడు ఇంటిపై కొంత మంది కొన్ని కారణలతో దాడికి పాల్పడ్డారన్నారు. బాధితుడు రాజశేఖర్ నాయుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో ఏడుగురిపై నమోదు చేశామన్నారు. సంయమనం పాటించి ప్రశాంత వాతవరణానికి అన్ని వర్గాలూ సహకరించాలన్నారు. రాజశేఖర్ నాయుడు కుటుంబాన్ని ఆరు మండలాల టీడీపీ అధ్యక్షులు, డాక్టర్ థామస్ సోదరుడు నిధి. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పరామర్శించారు. ఇరు వర్గాలను సర్దుబాటు చేస్తామన్నారు.

నేటి నుంచి చెన్నారెడ్డిపల్లెలో మహాభారత యజ్ఞం



యాదమరి, జూన్ 8: చెన్నారెడ్డిపల్లెలో ద్రౌపది ధర్మరాజుల ఆలయంలో ఆదివారం నుంచి మహాభారత యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం ఆలయంలో ద్రౌపది, ధర్మరాజులకు ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహిస్తామన్నారు. పాండవుల విగ్రహాలకు పూజలు చేసి ధ్వజరోహణం వద్ద కొలువుతీరుస్తారు. మహాభారత యజ్ఞంలో భాగంగా పగలు హరికథా కాలక్షేపం, రాత్రి వీధినాటక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

రక్తి కట్టించిన ఇలామంతుడి వధ

సోమల, జూన్ 8: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ భారతంమిట్టలో మహా భారత యజ్ఞంలో భాగంగా శనివారం ఇలామంతుని వధ నాటక ప్రదర్శన రక్తి కట్టించారు.ఉదయం ధర్మరాజుల ఆలయంలో మూల విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం ఇలామంతుని ప్రతిమను ఆలయం ఎదుట ఏర్పాటు చేసి పీలేరు నాటక మండలి సభ్యులు నాటక ప్రదర్శన చేసి మెప్పించారు. ద్రౌపతీదేవి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

కంటైనర్‌ను ఢీకొని బోల్తాపడిన కారు

● ముగ్గురికి గాయాలు



గుడిపాల, జూన్ 8: చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలో శనివారం తెల్లవారుజామున కంటైనర్ ఢీకొని కారు బోల్తాపడిన ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. మురకంబట్టు నుంచి వేలూరు వైపు వెళ్తున్న కారును వెనుకవైపు నుంచి కంటైనర్ ముట్టుకూరుపల్లి మలుపు వద్ద ఢీకొంది. డ్రైవర్ అదుపు చేయలేకపోవడంతో కారు పల్టీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నాలుగు టిప్పర్ల ఇసుక సీజ్



నగరి జూన్8: నగరి మండల పరిధిలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై గురించి శనివారం అధికారులు దాడులు చేశారు. నాలుగు టిప్పర్లను సీజ్ చేశారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి సెబ్ ఎస్ఐ కృష్ణానాయక్ స్పందించారు. ఆయన ఆధ్వర్యంలో సిబ్బంది రెవెన్యూ అధికారులు ఇసుక డంపింగ్ వద్ద దాడులు జరిపారు. టిప్పర్‌కు రూ20,000 వంతున జరిమానా విధించారు. డంపింగ్ ప్రాంతంలోని 250 టన్నుల ఇసుకను రెవెన్యూ అధికారుల స్వాధీనం చేసుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



యాదమరి, జూన్ 8: అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలపాలని ఎస్ఐ రామాంజినేయులు కోరారు. బుడితిరెడ్డిపల్లె పంచాయతీలోని మంగలోళ్లగుట్ట వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పది స్థితిలో మృతి చెందాడు. మృతుడి ఎడమ చాతిపై మణిమేఘలై అని పచ్చబొట్టు ఉంది. యో కూపర్ బ్లాక్ కలర్ టీషర్ట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు 9440900684 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

రామోజిరావుకు చిత్తూరుతో విడదీయరాని బంధం


రామోజీరావుతో రాజశేఖర్ నాయుడు (ఫైల్ ఫొటో)

చిత్తూరు కల్చరల్, జూన్ 8: రామోజీరావుకు చిత్తూరుతో విడదీయరాని బంధం ఉంది. ఆయన కుమారుడు కిరణ్‌కు చిత్తూరుకు చెందిన పౌల్ట్రీ పారిశ్రామికవేత్త దివంగత సుందర నాయుడు కుమార్తె శైలజతో వివాహం చేశారు. 1982లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తిరుపతిలో ఈనాడు మూడో ఎడిషన్ ప్రారంభించారు. వియ్యంకుడు సుందరనాయుడు ఇంట జరిగే ముఖ్యమైన కార్యక్రమాలను రామోజీ వచ్చేవారని స్థానికులు గుర్తు చేసుకున్నారు. 1998లో కల్చరల్ అకాడమీ సాంస్కృతిక సంస్థ ఆవిర్భావ కార్యక్రమాలకు ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించారు. సుందరనాయుడు వివాహ స్వర్ణోత్సవాలకు చివరిసారిగా హాజరయ్యారు. రామోజీ మృతికి కల్చరల్ అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి రాజశేఖర్‌నాయుడు సంతాపం తెలియజేశారు.

గురుకులంలో ముగిసిన వేసవి శిక్షణశిబిరం


శిక్షణ పూర్తి చేసుకున్న పిల్లలు

పుంగనూరు, జూన్ 8: పుంగనూరు గురుకులంలో 46 రోజులుగా 100 మంది పిల్లలకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగిసిందని చెస్ కోచ్ మణికంఠ తెలిపారు. శనివారం స్థానిక కుమ్మరవీధిలోని గురుకులంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెస్‌తో బాటు 10 రకాల క్రీడల్లో పిల్లలకు శిక్షణ, క్రమ శిక్షణ, యోగ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. పుంగనూరు, పిచ్చిగుంట్లపల్లె, పాళ్యంపల్లె, బండ్లపల్లెల్లో 100మంది పిల్లలకు చెస్, క్యారమ్స్, షెటిల్, టెన్నికాయిట్, తదితర క్రీడల్లో శిక్షణ ఇచ్చామని వివరించారు. ఈ పోటీల్లో విజేతలైన పిల్లలకు మెడల్స్, సర్టిఫికెట్లు పంపిణీ చేశామని వివరించారు. ఆదివారం పుంగనూరులో 100 పిల్లలకు స్పోర్ట్స్‌డే తరహా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మొక్కులు తీర్చుకున్న జనసేన నాయకులు

శాంతిపురం, జూన్ 8 : కూటమి అధికారంలోకి రావడంతో జనసేన మండల నాయకుడు రాజేంద్ర ఆధ్వర్యంలో శనివారం అప్పయ్య తోపు ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. 101 కొబ్బరి కాయులు కొట్టి మొక్కులు తీర్చుకొన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భారీ మెజారిటీతో గెలుపొంది, కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే 101 కొబ్బరి కాయలు కొడతామని అప్పయ తోపు ఆంజనేయస్వామికి రాజేంద్ర మొక్కుకున్నారు. శనివారం మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు.

అక్షరయోధుడు రామోజీకి నాయకుల నివాళులు


హైదరాబాద్‌లో రామోజీరావు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న దగ్గుమళ్ళ, గురజాల జగన్మోహన్,భానుప్రకాష్,పూతలపట్టులో మురళీమోహన్

చిత్తూరు సిటీ, జూన్8: ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావుకు టీడీపీ నేతలు ఘన నివాళులర్పించారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ రామోజీరావు సమాజానికి ఒక మార్గదర్శకుడని కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, మాజీ మేయర్ కటారి హేమలత నేతలు గురజాల చెన్నకేశవులు నాయుడు, మోహన్‌రాజ్, సీఎం విజయ,తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో రామోజీరావు పార్థివదేహానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు పూలమాలవేసి నివాళులర్పించారు. రామోజీరావు జీవితం ప్రతిఒక్కరికి ఆదర్శమని తెలిపారు. ఆయన తనను ఎంతో ప్రభావితం చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో తమ వ్యాపారాల్లో మెలకువలు గ్రహించి తాముకూడా వ్యాపారవేత్తలుగా ఎదిగామని తెలిపారు.


చిత్తూరు జిల్లా పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకుల నివాళి

నగరి: అలుపెరుగని అక్షరయోధుడు రామోజీరావు మృతి తెలుగు సమాజానికి తీరనిలోటు అని ఎంఎల్ఏగా ఎన్నికైన గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో రామోజీరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. **బంగారుపాళ్యం:** మండల టీడీపీ కార్యాలయంలో రామోజా చిత్రపటానికి ఎమ్మెల్యేగా ఎన్నికైన మురళీమోహన్ నివాళులర్పించారు. **విజయపురం:** మల్లారెడ్డి కండ్రిగలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పాలసముద్రం: స్థానిక టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. **నింద్ర:** మండల కేంద్రంలో రామోజీ చిత్రపటానికి మండల టీడీపీ నాయకులుపూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **నగరి:** నగరి టవర్‌క్లాక్ వద్దనివాళులర్పించారు. **గుడిపాల:** గుడిపాలలో రామోజీరావు చిత్రపటానికి మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాలాజి నాయుడు నివాళులర్పించారు. **వెదురుకుప్పం:** రామోజీరావు చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. **చిత్తూరు రూరల్:** బెంగళూరులోని తమ నివాసంలో రామోజీరావు చిత్రపటం వద్ద జడ్పీ మాజీ చైర్మన్ గీర్వాణి చంద్రప్రకాష్ దంపతులు నివాళి అర్పించారు.


గీర్వాణి దంపతుల నివాళి

హంస వాహనంపై ఊరేగిన వరదుడు



యాదమరి, జూన్ 8: స్థానిక త్రివేణి సంగమంలో ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారు హంసవాహనంపై ఊరేగారు. అంతకుముందు వేకువజామున మూలస్థానంలో శ్రీదేవి సమేత ఇంద్రవరదునికి ప్రత్యేక అలంకరణలు, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుడి ఉత్సవమూర్తులకు కళ్యాణవేదికలో కొలువుతీర్చి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేసి సంప్రంలో ఉత్సవంలో కొలువుతీర్చారు. పురవీధుల్లో ఊరేగించగా స్వామివారికి భక్తులుటెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. బ్రహోత్సవాల్లో ఆదివారం స్వామివారు ఉదయం యాళివాహనంపై ఊరేగనున్నారు.

విద్యుత్ డివిజన్ ఇన్‌చార్జ్ ఈఈ బాధ్యతలు స్వీకరణ


మునిచంద్రను సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

చిత్తూరు రూరల్, జూన్ 8: విద్యుత్ శాఖ చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఇన్‌చార్జ్ ఈఈగా మునిచంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో ఇన్‌చార్జ్‌గా ఉన్న ఆర్ 3 డివిజన్ డీఈ పద్మనాభపిళ్లై ఆయన స్థానానికి వెళ్లారు. పీలేరు డివిజన్ ఈఈగా ఉన్న మునిచంద్రాను చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈగా అదనపు బాధ్యతులు అప్పగించారు. ఆయన్ను అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈలు, ఏఈలు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నాయకుల ఘన నివాళి


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జూన్8: టీడీపీ కూటమి ఘనవిజయం సాధించిన సందర్భంగా ఆ పార్టీ నేతలు ఎన్టీఆర్ విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. శనివారం ఉదయం జిల్లా పార్టీ కార్యాలయంలోని ఎన్టీయార్ విగ్రహానికి, డీసీసీ బ్యాంక్, నగరపాలక సంస్థ కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు గురజాల చెన్నకేశవులు నాయుడు, వెంకటేష్ యాదవ్, కాజూరు రాజేష్, ఈశ్వర్, రాజశేఖర్, శంకర్, ఫైరోజ్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే... అంతే సంగతులు


కోనకాలువ వద్ద దెబ్బతిన్న బ్రిడ్జి

పాలసముద్రం, జూన్ 8: చిత్తూరు - బలిజకండ్రిగ రోడ్డులో పాలసముద్రం పోలీసుస్టేషన్‌కు సమీపంలో కోన కాలువకు నిర్మించిన బ్రిడ్జి మధ్యలో గొయ్యి ప్రమాదకరంగా తయారైంది. ఏడాదిగా ఈ బ్రిడ్జికి గొయ్యిని ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోలేదు. స్థానికులే గొయ్యిలో మట్టిపోసి పూడ్చారు. ఇటీవల వర్షానికి ఆ గొయ్యి మళ్లీ పెద్దది కావడంతో వాహనదారులు చాలా యాతన పడుతున్నారు. తెలియని ద్విచక్రవాహనదారులు గొయ్యిలో పడి గాయాలపాలవుతున్నారు. వర్షాలకు గొయ్యి నిండిపోయింది. గొయ్యి ఉందనే సంగతి కొత్తవారికి తెలియడం లేదు. కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డు కూడా అధికారులు ఏర్పాటు చేయలేదు. బ్రిడ్జికి మరమ్మతులు చేయాలని కోరినీ పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

జడ్పీ మాజీ సీఈవోపై చర్యలు తీసుకోండి

● కలెక్టర్‌కు టీడీపీ నాయకులు ఫిర్యాదు

చిత్తూరు రూరల్, జూన్ 8: జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి చేసిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నేత చంద్రప్రకాష్‌లు కలెక్టర్ షణ్మోహన్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి సీఈవో అక్రమాలపై ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు, సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు ఇప్పటికీ బిల్లులు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐదేళ్ల క్రితం చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా, వైసీపీ నాయకులు చేసిన కొత్త పనులకు బిల్లులు మంజూరు చేశారని ఆరోపించారు. అప్పులు చేసి పనులు చేసిన వారు బిల్లులు మంజూరు కాక, వడ్డీలు కట్టలేక, అప్పులు చెల్లించలేక అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విచారణ చేయాలని జేసీకి రాసినట్లు వారు తెలిపారు.

చినుకు పడితే చిత్తడే


ఎంఎం విలాసం వడ్డిండ్లులో బురదమయంగా తయారైన రోడ్డు

కార్వేటినగరం, జూన్ 8: కార్వేటినగరం మండలంలో చిన్నపాటి వర్షానికి గ్రామీణ ప్రాంత రోడ్లు బురదమయంగా తయారవుతున్నాయి. దీనివల్ల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌కేవీబీపేట నుంచి వత్తూలూరుకు వెళ్లే మట్టిరోడ్డు వర్షానికి చిత్తడిగా మారిపోయింది. మట్టిరోడ్డుపైన ఏర్పడిన గుంతలపై కనీసం మట్టి కూడా పోయలేదు. చింతమడ్డి వెళ్లే మట్టిరోడ్డు బురదమయంగా తయారైంది. మట్టిరోడ్డుకు కనీసం రిపేర్లు కూడా చేపట్టకపోవడంతో వర్షాకాలంలో ప్రజలునానావస్థలు పడుతున్నారు.

ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి సిబ్బంది సహకరించాలి

పుంగనూరు రూరల్, జూన్ 8: ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి డ్రైవర్లు డీజిల్ పొదుపు చేసి, కండెక్టర్లు అధిక కలెక్షన్లు సాధించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పుంగనూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.సుధాకరయ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో అత్యధికంగా హెచ్ఎస్‌డీ ఆయిల్ పొదుపుచేసిన డ్రైవర్లు కె.అన్వర్‌బాషా, సీ.రెడ్డెప్ప, ఎ.జనార్ధన్, పల్లెవెలుగు సర్వీసులో ఆదాయం సాధించిన ఆర్.పార్వతమ్మలను అభినందించారు. ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతి డ్రైవర్, కండెక్టర్ విధులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలతో పంటలకు తెగుళ్లు ..ఆందోళనలో అన్నదాత

గుడుపల్లె, జూన్ 8: మండలంలోని ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులకు నష్టం వాటిల్లింది. రైతులు బోర్ల నీటిపై ఆధారపడి కూరగాయలు పంటలు సాగుచేశారు. దిగు బడి చేతికి వస్తున్న తరుణంలో ఎడతెరపి లేకుండా వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ వర్షాలకు టమోటా, మిరప, బీన్స్ పంటలకు అగ్గి తెగుళ్ల సోకింది. తెగుళ్ల నివారణకు కోసం అనేక రకాల మందులు పిచికారి చేసిన ప్రయోజనం లేకుండా పోతోందని విచారం వ్యక్తం చేస్తున్నారు. నేలలో తేమశాతం పెరిగి దిగుబడుల్లో నాణ్యత లోపించడం వల్ల వేలకు వేలు పెట్టుబడులు పెట్టినా ప్రస్తుతం నష్టాలకు గురికావాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జోగిండ్లులో వర్షానికి తెగుళ్లు సోకిన మిరప పంట, అగరంలో వర్షానికి దెబ్బతిన్న టమోటా పంట